సాక్షి శ్రీకాకుళం

శనివారం । 7 । అక్టోబర్ । 2023



'ఉన్నతి'మైన ఆలోచన

ఉపాధి వేతనదారుల 'ఉన్నతి'కి రూపకల్పన చేశారు. వారి కుటుంబాల్లోని యువతకు శిక్షణ అందించనున్నారు.

- 8లో



పాట ఆగింది..

జానపద గాయకుడు అశోక్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మాకన్నపల్లి వద్ద ప్రమాదం జరిగింది.

- 8లో

8న దయాల్బాగ్ వస్తు ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కిన్నెర థియేటర్ కూడలిలో కళింగ వైశ్య కల్యాణ మండపంలో ఈ నెల 8న దయాల్బాగ్ వస్తు ప్రదర్శన, అమ్మకం నిర్వహిస్తున్నట్లు ఎగ్జిబిషన్ కన్వీనర్ ఎం ఎస్ఆర్ఎస్.ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రదర్శన కొనసాగుతుందని పేర్కొన్నారు. నాణ్యమైన వస్తువులు అతి తక్కువ ధరలకే లభిస్తాయని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ యూనివర్సిటీ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో శనివారం డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు. వర్సిటీ పరిపాలన కార్యాలయంలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య కార్యక్రమం ఉంటుందని, విద్యార్థులు ఫోన్ నంబర్ 8247861919 కి కాల్ చేయాలని అన్నారు. వర్సిటీకి సంబంధించి వివరాలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రస్తావించవచ్చని చెప్పారు. అన్ని విభాగాల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

స్పోర్ట్స్ కోటాలో పూజితకి ఏజీబీఎస్సీలో సీటు



పూజితను అభినందిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం: ఫెన్సింగ్ క్రీడల్లో రాణించిన జిల్లాకి చెందిన బడి పూజితకి స్పోర్ట్స్ కోటాలో ఏజీబీఎస్సీలో సీటు లభించింది. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి సీట్ల కేటాయింపు జాబితాలను ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రకటించగా.. ఏజీబీఎస్సీలో బడి పూజితకి ఫెన్సింగ్ స్పోర్ట్స్ కోటాలో సీటు దక్కింది. దీనిపై జిల్లా అధికారులు, జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు వైశ్యరాజు మోహన్, బలభద్రుని రాజా, జి.వెంకటేశ్వరరావు, జి.ప్రసాద్, ఎస్.నాయుడు, సుధీర్ వర్మ, జ్యోతిలు హర్షం వ్యక్తం చేశారు. పూజితను ఎస్పీ రాధిక అభినందించారు.

సమగ్ర దర్యాప్తుతోనే కేసుల్లో పురోగతి : ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : అపరిష్కృతంగా ఉన్న తీవ్ర నేరాల (గ్రేవ్) కేసుల్లో సమగ్రమైన దర్యాప్తు చేపట్టి పురోగతి సాధించాలని ఎస్పీ జీఆర్ రాధిక అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె శుక్రవారం గ్రేవ్ కేసులపై సర్కిల్ వారీ పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. హత్య, పోక్సో, రేప్ కేసులు, ప్రాపర్టీ కేసుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని, నార్కో డ్రగ్స్ కేసుల్లో కచ్చితమైన ఆధారాలతో దర్యాప్తు చేయాలన్నారు. కేసుల నమోదు, నిందితుల అరెస్టు, కేసుల యొక్క దర్యాప్తు, చార్జిషీటు దాఖలు వరకు సమగ్రమైన విచారణ చేయాలని సూచించారు. పోక్సో కేసుల దర్యాప్తులో జాగ్రత్తలు పాటిస్తూ నేరస్తులకు కచ్చితంగా శిక్ష పడేటట్లు చేయాలన్నారు. సమావేశంలో సెబ్ జేడీ ఎం.విజయ నాగమణికంఠ, అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు (క్రైమ్), జె.తిప్పేస్వామి (అడ్మిన్), డీఎస్పీలు డి.బాలచంద్రరెడ్డి, వై.శృతి, నాగేశ్వరరెడ్డి, ఎస్.బాలరాజు, సీహెచ్‌జీవీ ప్రసాదరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

'బడి బయట బాలలను గుర్తించాలి'

నరసన్నపేట: బడి వయసు బాలలు నిస్సహాయంగా వీధుల్లో ఉండిపోవడానికి వీల్లేదని సర్వ శిక్షా అభియాన్ కో ఆర్డినేటర్ పి.జనార్దనరావు అన్నారు. నరసన్నపేటలో శుక్రవారం జనార్దనరావు ఆధ్వర్యంలో కార్మిక శాఖ, ఏహెచ్‌టీయూ, సమగ్ర బాలల రక్షణ, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది శుక్రవారం గొట్టిపల్లిలో వీధుల్లో తిరిగి ఇద్దరు బాలలను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరిని స్కూల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోనున్నామని, బాలల తల్లిదండ్రులు అంగీకరిస్తే హోమ్‌లో జాయిన్ చేస్తామని తెలిపారు. గొట్టిపల్లి సర్పంచ్ అవ్వ రవీంద్ర సమక్షంలో తల్లిదండ్రులకు పోలీసు స్టేషన్ ఆవరణలో కౌన్సిలింగ్ ఇచ్చారు. బడి ఈడు పిల్లలు విధిగా పాఠశాలల్లోనే ఉండాలని బయట తిరగడం, యాచక వృత్తి చేయడం తగదని అన్నారు. ప్రభుత్వం ఇలాంటి పిల్లల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని అన్నారు.

ప్రగతి పదిరెట్లు

త్వరలో మరో రూ.50 కోట్లు

- అభివృద్ధి పథంలో జిల్లా కేంద్రం
- ఇప్పటికే రూ. 54.58కోట్లు ఖర్చు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి ధర్మాన
- రానున్న 4 నెలల్లో మరో రూ. 50కోట్లతో అభివృద్ధి పనులు
- రోడ్లు, డ్రైనేజీ, వంతెనలు, తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా అడుగులు



కొత్తపేట వద్ద నిర్మించిన స్మార్ట్ సిటీ రోడ్డు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: నాగావళి సాక్షిగా జిల్లా కేంద్రంలో ప్రగతి పరవళ్లు తొక్కుతోంది. శ్రీకాకుళం నగర అభివృద్ధిపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. గత ప్రభుత్వ పాలనలో పడకేసిన అభివృద్ధి పనులకు మంత్రి ధర్మాన ప్రసాదరావు కొత్త జీవం పోస్తున్నారు. ఐదేళ్ల టీడీపీ పాలనలో నగరంలో కేవలం రూ.5.59 కోట్లు మాత్రమే వెచ్చించగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పనుల కోసం ఇప్పటికే రూ.54.58 కోట్లు ఖర్చు పెట్టింది. అయితే ఇంతవరకు చేసింది ఒక లెక్క.. ఇకపై మరో లెక్క అన్నట్టుగా రానున్న నాలుగు నెలల్లో డివిజన్‌కు రూ.కోటి చొప్పున శ్రీకాకుళం నగరంలో మరో రూ. 50కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. దీంతో నగరంలో రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టులు, పైపులైన్లు తదితర సమస్యలు దాదాపు పరిష్కారం కానున్నాయి.

నేతల మధ్య కుమ్ములాటలు, నిధులు ఖర్చు పెట్టడంలో నిర్లక్ష్యం, మంజూరు చేయడంలో జాప్యం వెరసి.. టీడీపీ ఐదేళ్ల పాలనలో శ్రీకాకుళం నగర అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయింది. ఎంతసేపూ నిధులు స్వాహా చేసేందుకు అవకాశం ఉన్న నీరు–చెట్టు, ఇసుక తదితర వాటిపై దృష్టి సారించారే తప్ప నగరంలో రోడ్లు, డ్రైనేజీ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, తాగునీటిపై శ్రద్ధ చూపలేదు. దీంతో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేసరికి ఏ వీధి చూసినా గుంతలమయమైన రోడ్లు, అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ల సమస్యతో నగరమంతా మురికి కూపంగా తయారైంది. దుమ్ము, ధూళితో నగర ప్రజలు పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఇప్పుడా కష్టాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెక్ పెట్టింది. ముఖ్యంగా మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రత్యేక చొరవ తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టారు. తనకున్న పరిపాలన అనుభవం, నగరంపై ఉన్న అవగాహనతో తన దృష్టికొచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నారు.



కొత్తపేటలో నిర్మించిన పార్కు

సాక్షి డెవలప్‌మెంట్ వాచ్

డివిజన్‌కు రూ.కోటి చొప్పున వ్యయం

నగరంలో ఇంకా మిగిలి ఉన్న సమస్యల పరిష్కారానికి మంత్రి ధర్మాన ప్రసాదరావు నడుం బిగించారు. రానున్న నెలల్లో ఆ పనులు పూర్తి చేసేందుకు సంకల్పించారు. కార్పొరేషన్‌లోని ఒక్కో డివిజన్‌లో రూ.కోటి చొప్పున ఖర్చు చేయనున్నారు. వాటికి సంబంధించిన పనులను యుద్ధ ప్రాతిపదికన మంజూరు చేయడమే కాకుండా టెండర్లు ఖరారు చేసి నాలుగైదు నెలల్లో పూర్తి చేసేలా అడుగులు వేస్తున్నారు. దాదాపు రూ.50కోట్ల మేర రానున్న రోజుల్లో ఖర్చు చేయనున్నారు. రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టులు, తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా పనిచేయనున్నారు. ఇప్పటికే రూ.10 కోట్లు పనులను మంజూరు చేశారు. మిగతా వాటిని డివిజన్‌లో అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి వెంటనే మంజూరు ఇవ్వనున్నారు.

నాడు అలా.. నేడు ఇలా..

టీడీపీ హయాంలోని ఐదేళ్లలో రోడ్లు, డ్రైనేజీ పునర్నిర్మాణ, మరమ్మతులకు కేవలం రూ.5కోట్ల 59లక్షల 77వేలు ఖర్చు పెట్టగా అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.11కోట్ల 5లక్షల 59వేలతో వెచ్చించింది.

- గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా రూ.5.80కోట్లతో 72రోడ్లు, డ్రైనేజీల పనులు చేపట్టారు.
- అంతేకాకుండా నగరంలో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ పరిధిలోకి రాని 37 బీటీ రోడ్లను రూ.10.50 కోట్లతో పునర్నిర్మించింది.
- రూ.కోటి 40లక్షలతో కలెక్టరేట్ దగ్గర ప్రత్యేకంగా స్మార్ట్ సిటీ రోడ్డు నిర్మించారు.
- కార్పొరేషన్‌లో విలీనమైన పంచాయతీల్లో రూ.3కోట్లతో రోడ్లు, డ్రైనేజీ పనులు చేశారు.
- నగర సుందరీకరణలో భాగంగా రూ.75లక్షలతో మ్యూరల్ పెయింటింగ్స్, రూ.కోటి 68లక్షలతో మొక్కలు నాటారు.
- డే అండ్ నైట్ జంక్షన్ దగ్గరలోని నాగావళి పక్కన రూ. కోటి 40లక్షల వ్యయంతో గ్యాస్‌తో రన్ అయ్యే శ్మశాన వాటికను నిర్మించారు.



రామకృష్ణానగర్‌లో రూ. కోటితో కొత్తగా నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రం

పక్కా ప్రణాళికతో..



శ్రీకాకుళం నగరంలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాం. రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టుల సమస్య లేకుండా చూడాలన్నదే మా ప్రథమ కర్తవ్యం. ఒక వైపు ప్రజల సాధారణ సమస్యలు పరిష్కరించడంతో పాటు నగర ఆధునికీకరణ కోసం అవసరమైన అభివృద్ధి పనులు చేపడుతున్నాం. రానున్న నాలుగు నెలల్లో రూ. 50కోట్లతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం. నిధుల సమస్య లేదు. త్వరితగతిన కాంట్రాక్టర్లను నియమించి పనులు త్వరగా చేయనున్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా నాలుగేళ్ల కాలంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నాం.

– ధర్మాన ప్రసాదరావు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి

శాశ్వత పనులు..

- రోడ్లు, డ్రైనేజీ పనులే కాకుండా నగరంలోని పలు శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.
- అస్తవ్యస్తంగా ఉన్న పాట్టి శ్రీరాముల మార్కెట్‌ను రూ. 2.20కోట్లతో ఆధునికీకరించారు.
- రూ. 2.50కోట్లతో బలగ మంచినీటి ప్రాజెక్టు సామర్థ్యం పెంచారు.
- రూ.4కోట్లతో నాలుగు పట్టణ ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేశారు.
- రూ. 3.70కోట్లతో నగరంలోని ఆరు పార్కులను ఆధునికీకరించారు.
- మరో రూ. 2.20కోట్లతో విజయాదిత్య పార్కు అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.
- నాడు–నేడు కింద రెండు దశల్లో రూ.15.65కోట్లతో 34 పాఠశాలలను అభివృద్ధి చేశారు.
- అరసవిల్లి ఇంద్రపుష్కరిణి ఆధునికీకరణ కోసం రూ. 5.87కోట్లతో పనులు చేపట్టనున్నారు.

కోవెల.. కళకళ

- జిల్లాలో శరవేగంగా 78 ఆలయాల నిర్మాణాలు
- ఒక్కో నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున శ్రీవాణి ట్రస్ట్ నిధులు
- ఆలయ నిర్మాణాలకు టీటీడీ అండ

అరసవల్లి: జిల్లాలో నూతన దేవాలయాల నిర్మాణాలకు తిరుమల తిరుపతి దేవస్థానం అండగా నిలుస్తోంది. టీటీడీకి చెందిన శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ప్రస్తుతానికి రూ.7.80 కోట్ల మేర నిధులతో జిల్లాలో 78 ఆలయాలు నిర్మితమవుతున్నాయి. దేవదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్న ఈ ఆలయాల నిర్మాణాలతో హిందూ దేవాలయాల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. టీటీడీ నిబంధనల మేరకు గ్రామాల్లో రిజర్వ్ స్థలం లేదా, గ్రామాల పెద్దల తీర్మాన ఆమోదం పొందిన స్థలంలో గ్రామదేవతలు, ఇతర దేవతామూర్తుల ఆలయాల నిర్మాణాలకు తగిన ప్లానింగ్‌తో ప్రతిపాదనలు అందిస్తే ఆయా గ్రామ పెద్దల బృందానికి ప్రత్యేక ఖాతాల్లో నిధులు జమ చేస్తారు. ఈ మేరకు జిల్లాలో చాలా వరకు నియోజకవర్గాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకారుల ప్రాంతాల్లో అధికంగా ప్రతిపాదనలు అందాయి. అయితే స్థానిక గ్రామ పెద్దల తీర్మానాలు, వివాదాలకు ఆస్కారం లేని ప్రతిపాదనలకు మాత్రమే దేవదాయ శాఖ అనుమతిచ్చింది. దీంతో ఇప్పటివరకు జిల్లాలో 78 ఆలయాల నిర్మాణాలకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది.



ఆమదాలవలస మండలం దూసిపేటలో పూర్తయిన రామాలయం వద్ద ఈఈ రమణ, ఎ.సి చంద్రశేఖర్

ఒక్కో ఆలయానికి రూ.10 లక్షలు

జిల్లాలో మొత్తం 78 ఆలయాలు నిర్మిస్తుండగా ఒక్కో ఆలయానికి రూ.10 లక్షలు చొప్పున టీటీడీ నిధులు మంజూరు చేస్తోంది. దశల వారీగా ఈ నిధులను సంబంధిత ఖాతాకు జమ చేస్తుంది. జిల్లాలో ఫేజ్–1లో 31 చోట్ల, ఫేజ్–2లో 35, ఫేజ్–3లో 12 చొప్పున ఆలయాల నిర్మాణాలకు ప్రతిపాదనలు ఆమోదం పొందాయి. అయితే ప్రస్తుతానికి మొదటి విడత నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. 22 ఆలయాల నిర్మాణాలు దాదాపుగా పూర్తయే స్థితికి చేరుకోగా, 9 ఆలయాలు నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి.

ఎస్సీ, ఎస్టీ ప్రాంతాలకు ప్రాధాన్యత

జిల్లాలో టీటీడీ సౌజన్యంతో ప్రస్తుతానికి 78 ఆలయాల నిర్మాణాలకు ఆమోదం లభించింది. మరిన్ని ఆలయాలకు ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి. ఇటీవల జిల్లాలో ఎస్సీ, ఎస్టీతో పాటు మత్స్యకారులు ఉన్న ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. ఇటీవలే పలు ఆలయాల నిర్మాణాలను జిల్లా ఎండోమెంట్ అధికారి చంద్రశేఖర్‌తో కలిసి పరిశీలించాం. 9 వరకు ఆలయాలు పూర్తయ్యాయి. మిగిలిన చోట్ల కూడా వేగంగా పనులు జరుగుతున్నాయి.

– సీహెచ్ వెంకటరమణ, ఈఈ, దేవదాయ శాఖ.

నవంబర్ ఆఖరుకు నిర్వాసితులకు ప్లాట్లు

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్
- మూలపేట పోర్టు నిర్వాసిత కాలనీ పరిశీలన



నౌపడ వద్ద పోర్టు నిర్వాసిత కాలనీ పనులను పరిశీలించి కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: మూలపేట పోర్టు నిర్వాసితుల కోసం నౌపడ వద్ద నిర్మిస్తున్న కాలనీ లే అవుట్‌లో నవంబర్ నెలాఖరు నాటికి వారికి ప్లాట్లు అప్పగించేందుకు చర్యలు చేపడతున్నామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ఆయన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమార్ తదితరులు శుక్రవారం నిర్వాసిత కాలనీలో లేఅవుట్ పనులను పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న ఎర్త్ వర్క్ పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం నిర్వాసిత కాలనీ కమిటీ సభ్యులతో మాట్లాడారు. అన్ని రకాల మౌలిక సదుపాయాలతో నిర్మిస్తున్న కాలనీలో ఎక్కడా ముంపు ప్రభావం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరంతా దిగువ ప్రాంతాలకు వెళ్లిపోయే విధంగా పటిష్టమైన డ్రైనేజీ వ్యవస్థను నిర్మిస్తామన్నారు. అలాగే సమీపంలో గల తేలినీలాపురం నుంచి మంచినీటి సరఫరాకు చర్యలు చేపడుతున్నామని, అక్కడ పుష్కలంగా నీటి వనరులు ఉన్నాయన్నారు. ఈ విషయంలో నిర్వాసితులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. నిర్వాసిత కాలనీలో ఇంటి నిర్మాణాలు, అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించిన తర్వాతనే నిర్వాసితులంతా ఈ కాలనీల్లో గృహ ప్రవేశాలు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రైవేట్ వెంచర్‌కు దీటుగా నిర్వాసిత కాలనీ నిర్మిస్తున్నామన్నారు.

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ నిర్వాసిత కాలనీ నిర్మాణం విషయంలో నిత్యం ఆయా అధికారులతో చర్చిస్తున్నామన్నారు. అలాగే హిరమండలం నుంచి రానున్న తాగునీటిని ఈ నిర్వాసిత కాలనీకు మళ్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళ్లామని ఆయన వెల్లడించారు. నిర్వాసిత కాలనీ నిర్మాణం విషయంలో కొంత మంది చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని ఆయన సూచించారు. వీరితో పాటు ఆర్ అండ్ ఆర్ కాలనీ కమిటీ సభ్యులు జీరు రాంబాబు, జీరు, డి.అప్పలరెడ్డి, స్థానిక నాయకులు పి.రవికుమార్ రెడ్డి, తహసీల్దార్ చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం.. ఆదరించండి

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

ఇచ్ఛాపురం రూరల్: ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం కూడా మత్స్యకారుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీ అందరి అభివృద్ధికి పెద్దపీట వేశారని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. డొంకూరు మత్స్యకార గ్రామంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన 'రచ్చబండ' కార్యక్రమంలో ఆమె పురవీధుల్లో పర్యటించి స్థానిక ప్రజలతో మాట్లాడారు. గత టీడీపీ హయాంలో మత్స్యకారులు వేట సమయంలో మృతి చెందితే నష్టపరిహారం అందించలేదని, ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో వేట సమయంలో మత్స్యకారుడు మృతి చెందితే ఆ కుటుంబానికి రూ.పది లక్షలు పరిహారం అందిస్తోందని అన్నారు. వేట నిషేధ సమయంలో గత ప్రభుత్వం రూ.4వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చినా చెల్లించిన దాఖలాలు లేవన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతానికి చెందిన మత్స్యకారులు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడంతో 5.45 కిలోమీటర్ల మేర రూ.387 లక్షలతో తారు రోడ్డు వేశామని, డొంకూరు వద్ద శిథిలావస్థలో ఉన్న వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మాణానికి రూ. 630 లక్షలు, బూర్జపాడు వద్ద వంతెన నిర్మాణానికి రూ.1050 లక్షలతో త్వరలో టెండర్ పిలిచి పనులు ప్రారంభిస్తున్నామని అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రూ.పది లక్షలతో లక్ష్మీపురం, డొంకూరు గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్స్ ఏర్పాటు చేశామన్నారు. ఇంతలా అభివృద్ధి చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. అనంతరం ఆమె అదే గ్రామంలో పల్లె నిద్ర చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, జెట్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ బుద్ధ మోహనాంగి, వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



డొంకూరులో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ పల్లెనిద్ర

నిర్వాసితులకు న్యాయం చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మూలపేట పోర్టుకు సంబంధించి రహదారి అనుసంధానానికి భూములిచ్చిన వారికి న్యాయం చేస్తామని రెవెన్యూ, స్టాంపులు అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు వెల్లడించారు. బన్నువాడ, మోదుగువలస, వేములవాడ గ్రామాల రైతుల నుంచి భూ సేకరణపై సంబంధిత రైతులతో భూముల ధర నిర్ణయంపై డీఎల్ఎన్‌సీ కమిటీ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో కలిసి శుక్రవారం ఆయన సమీక్షించారు. గత రికార్డులను పరిశీలించి సాధ్యాసాధ్యాలను పరిశీలించి రైతులకు తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ రైతులకు కావాల్సిన ధర ఇచ్చేందుకు చట్టపరమైన సమస్యలు ఉన్నాయన్నారు. బన్నువాడ, మోదుగువలస, వేములవాడ నుంచి మూలపేట పోర్టు రహదారికి అవసరమైన 63.62 ఎకరాల భూమి సేకరించేందుకు రైతులు, మహిళలతో ఇప్పటికే ధరపై చర్చించినట్లు వివరించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ రహదారికి అవసరమైన భూ వివరాలను తెలియజేశారు. గత మూడేళ్లుగా ఉన్న భూ విలువలను తెలిపారు. ఇప్పటి వరకు సంబంధిత రైతులతో భూ ధరలపై కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ చర్చించినట్లు వివరించారు.

వేములవాడ రైతులు మాట్లాడుతూ తమవి పంట భూములని, ఆలోచించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, టెక్కలి తహసీల్దార్ ప్రవళిక ప్రియ, భూ సేకరణ సెక్షన్ పర్యవేక్షకులు జీఎల్‌ఈ శ్రీనివాసరావు, మూడు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పల్లెకు మేలు

జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతంగా కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన శిబిరాలను జనం సద్వినియోగం చేసుకుంటున్నారు. అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకుని కావాల్సిన మందులు తీసుకుంటున్నారు. ఆస్పత్రికి తీసుకెళ్లాల్సిన వారిని అక్కడి సిబ్బందే దగ్గరుండి రిఫర్ చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

శుక్రవారం ఆరోగ్య సురక్ష ఇలా..

మండలాలు	30	క్యాంపులు	29
ఓపీ	8727	రిఫరల్స్	345



పెద్దపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్డులతో ప్రజలు



పొందూరు: ధర్మపురంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో స్పీకర్ తమ్మినేని



పెద్దపాడులో కంటి పరీక్షలు..

క్లుప్తంగా

ఎంబీఏ, ఎంసీఏల్లో మెరుగైన ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఐసెట్-2023 (ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల సెట్) అలాట్‌మెంట్‌లను ఉన్నత విద్యా మండలి ప్రకటించింది. జిల్లా కళాశాలల్లో మెరుగైన ప్రవేశాలు లభించాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఎంబీఏలో 55 సీట్లకు 55 ప్రవేశాలు లభించాయి. ఎంసీఏలో 44కి 44 సీట్లు నిండాయి. ప్రైవేట్ కళాశాలల్లో ఐతం 60కి 30, వెంకటేశ్వరలో 60కి 57, శివానీలో 60కి 16 సీట్లు నిండాయి.

విద్యార్థులకు అభినందనలు


జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ప్రసాదరావు, పోలీస్ అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులను పోలీసు అధికారులు అభినందించారు. కర్నూలు జిల్లా మహానందిలో జరిగిన పోటీల్లో రాణించిన ఎస్.నందిని (ఎచ్చెర్ల అంబేడ్కర్ గురుకుల పాఠశాల), ఎం.గాయిత్రి (చైతన్య కోఆపరేటివ్ కాలేజ్, శ్రీకాకుళం), ఎస్.హేమంత్‌కుమార్ (కుశాలపురం ప్రాథమిక పాఠశాల), ఎల్.మణికంఠ (మహాత్మా జ్యోతిబాపులే, నరసన్నపేట పాఠశాల) జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరిని ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో శుక్రవారం డీఎస్పీ డి.ప్రసాదరావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు సురేష్, ఉమామహేశ్వరరావు, ఆర్ఎస్సైలు వరప్రసాద్, రవి, ముబారక్ ఆలీ, సత్తిబాబు, ఉమామహేష్ అభినందించారు. రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. సీనియర్ క్రీడాకారులు పురుషోత్తం, పీడీ సింహాద్రి నాయుడు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల డిమాండ్లను ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కార్యాలయ ఆవరణలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈయూ నాయ కులు మాట్లాడుతూ సమస్యలు ప్రస్తావించారు. అన్ని నైట్‌ఔట్స్ ప్రదేశాల్లో వసతి సౌకర్యం కల్పించాలని, ఏడీ/పీడీ సెక్షన్‌లలో పని చేస్తున్న క్లర్కులపైన పని భారం తగ్గించాలని కోరారు. అన్ని కేటగిరీల వారీగా రిక్వెస్ట్ బదిలీలు క్లియర్ చేయాలని, అలవెన్సులు చెల్లించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు కచ్చితంగా నెలకి మూడు రోజులు రుతుక్రమణ లీవ్ ఇచ్చే విధంగా తగు ఆదేశాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో ఆర్టీసీ ఈయూ నాయకులు జి.త్రినాథ్, ఎస్వి రమణ, కె.బాబూరావు, పి.నానాజీ, ఖాదర్, జోగారావు, త్రివేణి, డి.లక్ష్మి, పాపారావు, బీఎస్ బాబు, అధిక సంఖ్యలో ఇయూ ఉద్యోగులు ఉన్నారు.

'ప్రభుత్వ ఉత్తర్వులు సంతోషకరం'

నరసన్నపేట: ప్రభుత్వ పెన్షన్ పొందుతున్న విశ్రాంత ఉద్యోగుల భార్యలు ఆయన కంటే ముందు చనిపోతే మట్టి ఖర్చుల కింద రూ.25వేలు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. గతంలో ఈ విధానం ఉన్నా 2022 కొత్త పీఆర్‌సీ వచ్చిన తర్వాత దీన్ని నిలిపివేశారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లగా వెంటనే స్పందించి మట్టి ఖర్చుల ఉత్తర్వులను సవరించిందని టెక్కలి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆర్.రామచంద్రరావు తెలిపారు. గతంలో నిలిపి వేసిన తేదీ నుంచి ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని తెలిపారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో నరసన్నపేట, పోలాకి మండలాలకు చెందిన విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం విడుదల చేసిన కొత్త జీఓ గురించి ఆయన వివరించారు. సమావేశంలో పొందూరు సంఘం అధ్యక్షుడు ఎ. ధర్మారావు, నరసన్నపేట సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ప్రభాకరరావు, బి.మోహనరావు పాల్గొన్నారు.

'జీడికి గిట్టుబాటు ధర కల్పించాలి'

కాశీబుగ్గ: జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, పంట సమగ్రాభివృద్ధికి జీడి బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కోనారి మోహనరావు డిమాండ్ చేశారు. కాశీబుగ్గ సీపీఎం కార్యాలయంలో శుక్రవారం జీడికి గిట్టుబాటు ధర కల్పించాలని ఈ నెల 10వ తేదిన కాశీబుగ్గలో జరగనున్న రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం సీపీఎం నాయకులు ఎస్.గణపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానికంగా పండిన జీడిపిక్కలు కొనుగోలు చేసిన అనంతరం మాత్రమే విదేశీ జీడిపిక్కలు దిగుమతికి అనుమతించాలని, ఉపాధి హామీ పథకం ద్వారా జీడి తోట అభివృద్ధికి ఎకరాకు రూ.94 వేలు రైతులకు క్షేత్రస్థాయిలో అందించాలని కోరారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹235	₹ 255

ఉన్నతిమైన ఆలోచన



- ఉపాధి వేతనదారుల కుటుంబాల్లో యువతకు ఉచిత శిక్షణ
- శిక్షణ కాలానికి స్టయిఫండ్
- జిల్లాలో 20వేల మందికి అవకాశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం.. ఎన్నో వేల కుటుంబాలకు అన్నం పెడుతోంది. ఇప్పుడు ఆ పథకాన్ని మరో మెట్టు పైకి ఎక్కిస్తూ 'ఉన్నతి' కార్యక్రమానికి రూపకల్పన చేశారు. ఆ మేరకు ఉపాధి పథకంలో పని చేస్తున్న వేతనదారుల కుటుంబాల్లోని యువతకు ఉచితంగా పలు అంశాల్లో శిక్షణలు అందజేయనున్నారు. అందుకు కావాల్సిన కార్యాచరణను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఉపాధి పనులు చేస్తున్న వారి కుటుంబాల్లో ఆసక్తి గల యువతకు పలు వృత్తుల్లో శిక్షణ ఇవ్వడం, ఆ సమయంలో స్టయిఫండ్ ఇచ్చి ఆర్థిక ఇబ్బంది లేకుండా చేస్తారు. ఈ ఏడాదిలోనే తొలి విడత శిక్షణ ప్రారంభం కానుంది. జిల్లాలో ఈ విడతలో ఎస్సీ, బీసీ, ఎస్టీ వర్గాల నుంచి వంద రోజులు పనిదినాలు పూర్తి చేసి వారి కుటుంబాల నుంచి దాదాపు 20వేల మందికి ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.

వంద రోజుల పాటు స్టయిఫండ్

తొలుత వంద రోజులు పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలను గుర్తిస్తారు. అనంతరం ఆ కుటుంబాల్లోని యువతకు శిక్షణలకు పిలుస్తారు. ఈ శిక్షణ పూర్తి ఉచితం. అలాగే శిక్షణ కాలంలో రోజు వారీ వేతనం డబ్బులను స్టయిఫండ్ రూపంలో అందజేస్తారు. సంబంధిత శిక్షణలో యువత కనీసం 75 శాతం రోజులు విధిగా హాజరు కావాల్సి ఉంటుంది. గరిష్ఠంగా వందరోజులు ఉపాధి హామీ పనులు చేసిన కుటుంబాల వారికే ఈ అవకాశం ఇస్తున్నారు. సంబంధిత సంస్థలు క్షేత్రస్థాయిలో పనిచేసే ఉపాధి హామీ పథకం సిబ్బంది సాయంతో.. ఆయా కుటుంబాలను ప్రత్యక్షంగా సందర్శించి శిక్షణ పొందేందుకు ఆసక్తి గల యువత పేర్లను నమోదు చేసుకుంటారు. ఆ తర్వాత అర్హులైన వారికి సీడాప్, ఆర్ఎస్ఈటిఐ, కేవీకే వంటి సంస్థల ద్వారా శిక్షణ అందజేస్తారు. ఈ శిక్షణకు గ్రామ స్థాయిలో ఉపాధి హామీ పథకం సిబ్బంది వద్ద నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది.

అర్హతలు

ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల వారి యువతకు 18-45 ఏళ్ల మధ్య, ఇతర సామాజిక వర్గాల్లో 18-35 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఈ కుటుంబం గత ఏడాదిలో వంద రోజులు పనిదినాలు చేసి ఉండాలి. జిల్లాలో గత ఏడాది వందరోజులు పని దినాలు పూర్తి చేసిన వారు ఎస్సీ సామాజిక వర్గంలో 5537, ఎస్టీ సామాజిక వర్గంలో 4382, బీసీ సామాజిక వర్గంలో 49,915 మంది కుటుంబాలు ఉన్నాయి. వీరిలో సుమారుగా 20 వేల మంది వరకు యువత ఈ శిక్షణ ప్రయోజనం పొందేందుకు అవకాశం ఉంది.

192 రకాల శిక్షణలు

ఈ శిక్షణలు 192 రకాలు అందజేయనున్నారు. అయితే ఆ ప్రాంతాల అవసరాలు, వనరులు, శిక్షణ ఇచ్చే సంస్థ వెసులుబాటును బట్టి అక్కడ శిక్షణల ఎంపికలు ఉంటాయి. కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు ద్విచక్ర వాహనాల రిపేర్లు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ రిపేర్ అండ్ సర్వీసింగ్, ఇంటర్నెట్ సేవలు వంటి శిక్షణలు ఉంటాయి.

వంద రోజుల పనుల ఆధారంగా

గత ఆర్థిక సంవత్సరంలో వంద రోజులు పని దినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల నుంచి అర్హత మేరకు యువతను ఎంపిక చేసి శిక్షణను అందజేస్తారు. గ్రామస్థాయిలో గ్రామ సహాయకుల ద్వారా అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ జరుగుతుంది. ఈ శిక్షణల వల్ల యువతకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది.

– జీవీ చిట్టిరాజు, పీడీ, డ్వామా, శ్రీకాకుళం.

జాబ్‌మేళాలో 184 మంది ఎంపిక


ఎంపికైన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: యువత స్థానికంగా ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఎక్కడ ఉద్యోగం వచ్చినా చేసుకోవాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం మెగా ఉద్యోగ మేళా నిర్వహించారు. మేళాలో 10 ప్రైవేటు సంస్థలు పాల్గొని 184 మందిని వివిధ కంపెనీలకు ఎంపిక చేశాయి. జిల్లా నైపుణ్యాభివృద్ధి సాయి శ్రీనివాస్, సెట్ శ్రీ సీఈవో ప్రసాదరావు, జిల్లా టూరిజం అధికారి నారాయణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని నియోజకవర్గాల్లోనూ స్కిల్ హబ్స్ ద్వారా యువతకు సాంకేతిక పరిజ్ఞానాన్ని, తరగతులను, ల్యాబ్‌లను ఏర్పాటు చేసి, శిక్షణలను అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రదీప్, వైస్ ప్రిన్సిపాల్ చత్రపతి, చంద్రమౌళి, మన్మథ్‌నాథ్, వంశీకృష్ణ, శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సీఆర్‌పీఎఫ్ జవాన్ మృతి


అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న సిబ్బంది


రవికుమార్ (ఫైల్)

సారవకోట: మండలంలోని అంగూరు గ్రామానికి చెందిన లింగుభేరి రవికుమార్ (41) గురువారం మహారాష్ట్రలోని లాసూర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈయన లాసూర్‌లో సీఆర్‌పీఎఫ్‌లో విధులు నిర్వర్తిస్తూ అక్కడకు 30 కిలోమీటర్ల దూరంలో రోడ్డు ప్రమాదంలో గురువారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని శుక్రవారం స్వగ్రామానికి సంబంధిత సిబ్బంది తీసుకొచ్చి అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వర్తించారు. మృతుడికి భార్య రోహిణి, కుమారుడు సుశాంత్, కుమార్తె నివేదిత ఉన్నారు.

పాట ఆగింది

- రోడ్డు ప్రమాదంలో జానపద గాయకుడు మృతి


రికార్డింగ్ సెంటరులో పాట పాడుతున్న అశోక్


ప్రమాదస్థలంలో అశోక్‌కుమార్ మృతదేహం

పలాస, కాశీబుగ్గ: పలాస మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన జానపద కళాకారుడు, గాయకుడు సాలిన అశోక్‌కుమార్(31) శుక్రవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన జాతీయ రహదారి రోడ్డు పనుల్లో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా మధ్యాహ్నం భోజనం చేసి ఇంటి నుంచి తన స్కూటీపై వెళ్తుండగా మాకన్నపల్లి రోడ్డు మలుపు వద్ద ఎదురుగా వచ్చిన బొలేరో లగేజ్ వ్యాను ఢీకొనడంతో అక్కడికక్కడే ఊపిరి వదిలేశాడు. విషయం తెలిసిన వెంటనే పరిసర గ్రామ ప్రజలంతా అక్కడకు చేరుకొని భోరున విలపించారు. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు ఉన్నారు. వారి రోదన ఆపడం ఎవరి తరం కాలేదు. అలాగే ఉద్దానం ప్రాంతానికి చెందిన కళాకారులు, గాయకులు అక్కడకు చేరుకొని అతని జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మృతదేహాన్ని కాశీబుగ్గ పోలీసులు సంఘటన స్థలం నుంచి పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఆయన స్వగ్రామం మాకన్నపల్లికి తీసుకెళ్లి అంత్యక్రియలు జరిపించారు. ఈ సందర్భంగా ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక ఉపాధ్యక్షుడు కుత్తుం వినోద్ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు.

కవులు, రచయితలు డాక్టరు కుమార్‌నాయక్, పత్తిరి తాతారావు, కిక్కర ఢిల్లీరావు, సిక్కోలు జానపద వేదిక అధ్యక్షుడు రాపాక ధనరాజు, మల్లేన దేవరాజు, రంగోయి తులసి, జానపద పరిశోధకుడు బద్రి కూర్మారావు, వంకల రాజారావు తదితరులు సంతాపం తెలియజేశారు.

పోక్సో కేసుపై విచారణ

శ్రీకాకుళం క్రైమ్ : స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం రాత్రి నమోదైన పోక్సో కేసుపై దిశా డీఎస్పీ ఎస్.వాసుదేవరావు విచారణ చేపట్టారు. గత నెల 30న రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో తమ కుమార్తె అదృశ్యమైందంటూ సంతబొమ్మాళి మండలానికి చెందిన మైనరు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఆమెను ఆదే మండలానికి చెందిన యువకుడు మోసగించినట్లు బాలిక తల్లి ఫిర్యాదు ఇవ్వడంతో పోక్సో కేసు నమోదైంది.

పెంపుడు కోళ్లపై విష ప్రయోగం


రావివలస గ్రామంలో మృత్యువాత పడిన కోళ్లు

టెక్కలి: టెక్కలి మండలం రావివలస గ్రామంలో భీముని వనజనాభం అనే వ్యక్తికి చెందిన 28 పెంపుడు కోళ్లపై విష ప్రయోగం జరిగింది. వనజనాభం పెంపుడు కోళ్లను పెంచుతూ విక్రయిస్తుంటారు. అయితే శుక్రవారం ఉదయం కోళ్ల షెడ్డును చూసేసరికి ఒక్కసారిగా కోళ్లు చనిపోయి ఉండడాన్ని గమనించారు.

దీంతో గ్రామ సర్పంచ్ సర్లాన బాలకృష్ణ, గ్రామపెద్ద సర్లాన సుధాకర్‌కు సమాచారం అందజేశారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. పశు సంవర్థక శాఖ సిబ్బందికి సమాచారం అందజేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృత్యువాత పడిన కోళ్లకు పంచనామా చేశారు. చివరగా విష ప్రయోగం జరిగినట్లుగా గుర్తించారు. ఈ సంఘటన పై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


మృతి చెందిన రాము

రణస్థలం: కొండములగాం పంచాయతీలో గల ముక్తుంపురం గ్రామానికి చెందిన జామి రాము(55) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. జేఆర్ పురం ఎస్ఐ జి.రాజేష్ తెలిపిన వివరాలు ప్రకారం ముక్తుంపురం గ్రామానికి చెందిన రాము పౌరాణిక నాటకాలతో పాటు, రోజువారీ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈయనకు మణికంఠ అనే కుమారుడు, భార్య లక్ష్మి ఉన్నారు. ఈ కుటుంబంలో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి కుమారుడు మణికంఠకు తండ్రి రాముకు గొడవ జరిగినట్లు చుట్టుపక్కల వారు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం రాము చనిపోయి ఉండటం, మెడకు ఉరి వేసినట్లు గాయాలు కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. అప్పటికే రాము అంత్యక్రియలు చేసేందుకు కుటుంబ సభ్యులు సన్నాహాలు చేస్తున్న సమయంలో పోలీసులు రంగప్రవేశం చేసి అంత్యక్రియలను నిలిపివేశారు. అనంతరం కుమారుడు మణికంఠను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. రాము మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి తరలించారు. దీనిపై జేఆర్ పురం ఎస్ఐ జి.రాజేష్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

'బీజేపీవి ఆర్ఎస్ఎస్ భావజాల పునాదులు'

శ్రీకాకుళం అర్బన్: ఆర్ఎస్ఎస్ భావజాల పునాదులపై బీజేపీ నడుస్తోందని డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి ధ్వజమెత్తారు. శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్ వద్ద శుక్రవారం బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ రాహుల్ గాంధీని రావణుడితో పోల్చుతూ బీజేపీ పోస్టర్లు వేయడం అవమానకరమన్నారు. ఇలాంటి చర్యలు బీజేపీ నాయకుల దురహంకారానికి పరాకాష్ఠ అని తెలిపారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సనపల అన్నాజీరావు, దేశెళ్ల గోవింద మల్లిబాబు, అంబటి కృష్ణారావు, రెల్ల సురేష్, కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి, లఖినేన సాయిరాం, బస్వా షణ్ముఖరావు, బొచ్చ వెంకటరమణ, తెంబూరు మధుసూదన్‌రావు, వి.శాంతారావు, అంబటి దాలినాయుడు, ఆబోతుల వెంకట నాయుడు, మామిడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి తగ్గించాలని ఖజానా ఉద్యోగుల వినతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఖజానా శాఖ ఉద్యోగులపై ఒత్తిడి తగ్గించాలని ఏపీ ట్రెజరీ సర్వీసుల అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షురాలు ఎం.భాగ్యలక్ష్మి, ఆమెతోపాటు ఎన్‌జీవో సంఘ నాయకులు హనుమంతు సాయిరాం తదితరులు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను శుక్రవారం సాయంత్రం కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖజానా అధికారి జిల్లాకు వచ్చి రెండేళ్లయ్యిందని, ఈ సమయంలో ఖజానా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె పేర్కొంది. ఇటీవల కాలంలో జరిగిన సాధారణ బదిలీలు, పదోన్నతులు, సర్వీసు రెగ్యులరైజేషన్ వంటి అంశాలలో ఉద్యోగులు సమస్యలు ఎదుర్కొన్నారని ఆమె తెలిపింది. ముందస్తు సమాచారం లేకుండా సీట్లను మార్పిడి చేస్తున్నారని, దీని వల్ల ఆడిట్ అధికారులుగా ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలసిన వారిలో భాగ్యలక్ష్మితో పాటు ఎన్‌జీవో సంఘ నాయకులు, ట్రెజరీ ఉద్యోగులు సురేష్‌కుమార్, చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో నంబర్ 1

- రోజుకు సగటున 4 నిమిషాలు మాత్రమే పవర్ 'కట్'
- సర్కిల్ పరిధిలో తగ్గుతున్న సరఫరా అంతరాయం
- 2 నెలలుగా 9 నిమిషాలు.. అక్టోబర్‌లో నాలుగు నిమిషాలు మాత్రమే
- పునరుద్ధరణ పనుల్లో వినూత్న ప్రణాళికలు
- ఏపీఈపీడీసీఎల్ పరిధిలో దూకుడుగా విశాఖపట్నం సర్కిల్

సాక్షి, విశాఖపట్నం :

గాలి వీచిందా..? అయితే కరెంట్ గోవిందా.? వర్షం పడుతోందా..? టార్చ్‌లైట్స్, చార్జింగ్ లైట్స్ వెతుక్కోవాల్సిందే. ఇంకేముంది.. గంటల తరబడి కరెంట్ రాదు.

ఏంటో ఈ పవర్ సప్లై... రోజులో గంటల తరబడి కరెంట్ ఉండటం లేదు.

ఇదీ ఒకప్పుడు వినియోగదారుల నుంచి తరచూ వినిపించిన మాట..

కాలం మారింది.. కరెంట్ సరఫరాలోనూ మార్పులు వచ్చాయి. సరఫరా అంతరాయమూ మారింది. వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దుకుంటూ.. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు విశాఖ సర్కిల్ నిరంతరం శ్రమిస్తోంది. అందుకే సగటున పవర్ కట్‌ని రోజులో కేవలం 4 నిమిషాలకు మాత్రమే తగ్గించుకుంటూ ఈపీడీసీఎల్ పరిధిలో ఉన్న సర్కిళ్లలో నంబర్ వన్‌లో కొనసాగుతోంది. విద్యుత్ సరఫరా విషయంలో విశాఖ దూకుడుగా వ్యవహరిస్తోందని సైదీ సైఫీ సూచీలే స్పష్టం చేస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) పరిధిలో 5 సర్కిల్స్ ఉన్నాయి. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, ఏలూరు, విజయనగరం సర్కిల్స్ పరిధిలో నిరంతరం విద్యుత్ సరఫరాలో ఉన్న లోపాలు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నారా లేదా అనే అంశాలను పరిశీలిస్తోంది. ఇందుకోసం ఏర్పాటు చేసిన వ్యవస్థలే సిస్టమ్ యావరేజ్ ఇంట్రప్షన్ డ్యూరేషన్ ఇండెక్స్ (సైదీ), సిస్టమ్ యావరేజ్ ఇంట్రప్షన్ ఫ్రీక్వెన్సీ ఇండెక్స్ (సైఫీ). రోజూ ఆయా సర్కిల్స్ పరిధిలో ఎంత సేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.? ఎంత సమయానికి పునరుద్ధరించారు.? ఇలాంటి వివరాలను ఎప్పటికప్పుడు గణిస్తూ సరాసరిని చూపిస్తుంటుంది. ఈ విషయంలో విశాఖ సర్కిల్ నంబర్‌వన్‌లో నిలిచింది. ఈ సర్కిల్ పరిధిలో 17,57,727 మంది వినియోగదారులున్నారు. ఇందులో 15,02,204 డొమెస్టిక్ కనెక్షన్లుండగా, 1,70,580 కమర్షియల్, 49,037 అగ్రికల్చర్, 30,632 ఇన్‌స్టిట్యూషనల్, 5,274 ఇండస్ట్రీస్ కనెక్షన్లున్నాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని సైదీ సైఫీ ర్యాంకింగ్స్‌ను ప్రకటిస్తారు.

ఏపీఈపీడీసీఎల్ సర్కిల్స్ పరిధిలో సైదీ సైఫీ పెర్ఫార్మెన్స్ వివరాలు

సర్కిల్	మొత్తం ఫీడర్లు	రోజులో సరఫరా సమయం (గం.లలో)	అంతరాయ సమయం (ని.లలో)	ర్యాంకు
విశాఖపట్నం	933	23:55:42	4.17	01
రాజమహేంద్రవరం	953	23:51:12	8:47	02
శ్రీకాకుళం	353	23:49:08	10:51	03
విజయనగరం	425	23:46:09	13:50	04
ఏలూరు	1158	23:43:21	16:38	05

నాలుగు నిమిషాలు మాత్రమే..

2014-19 మధ్య కాలంతో పోల్చితే సర్కిల్ పరిధిలో వినూత్న మార్పులు చోటు చేసుకున్నాయి. ఆ కాలంలో రోజుకు సగటున 60 నుంచి 85 నిమిషాల వరకూ విద్యుత్ అంతరాయం ఉండేది. అంటే 24 గంటల్లో కనీసం గంటకు పైగా కరెంట్ కోతలు ప్రజలను ఇబ్బందులకు గురిచేసేవి. పంపిణీ విషయంలో పక్కాగా వ్యవహరిస్తూ ఆధునిక సాంకేతికతను సిబ్బంది అందిపుచ్చుకుంటూ సరఫరా అంతరాయాన్ని తగ్గించారు. గంట ఉండే అంతరాయం క్రమంగా నిమిషాలకు చేరుకుంది. ఇప్పుడు కేవలం 4 నుంచి 10 నిమిషాలు మాత్రమే రోజులో పవర్ కట్ అవుతోంది. ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలలో సగటున రోజుకు 9 నిమిషాలు మాత్రమే పవర్ కట్ అవుతుండగా.. ఈ నెలలో కేవలం 4 నిమిషాలు మాత్రమే సగటు ఇంట్రప్షన్ ఉన్నట్లు సైదీ సైఫీ నివేదికలో స్పష్టమైంది.


పోల్‌పై విద్యుత్ తీగలను సరిచేస్తున్న సిబ్బంది

నంబర్ వన్ ర్యాంకులో... విశాఖ సర్కిల్

గత కొద్ది నెలలుగా విశాఖ సర్కిల్ సైదీ సైఫీ ర్యాంకింగ్‌లో నంబర్‌వన్ స్థానాన్ని నిలబెట్టుకుంటోంది. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అంతరాయాలు లేకుండా అందించడంలో సర్కిల్ అధికారులు, సిబ్బంది సఫలీకృతమవుతున్నారు. తర్వాత ర్యాంకింగ్స్‌లో రాజమండ్రి, శ్రీకాకుళం, ఏలూరు, విజయనగరం ఉన్నాయి. కేవలం సర్కిల్ మాత్రమే కాకుండా.. ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు ఇంట్రప్షన్ తగ్గిస్తూ సరఫరా అందిస్తున్నారు. విశాఖ సర్కిల్‌లో 4 నిమిషాలు మాత్రమే ఉండగా రాజమహేంద్రవరంలో 8 నిమిషాలు, శ్రీకాకుళం పరిధిలో 10, విజయనగరంలో 13, ఏలూరులో 16 నిమిషాలు మాత్రమే రోజుకు సగటున విద్యుత్ కోతలు జరుగుతున్నట్లు సైదీ సైఫీ ర్యాంకింగ్స్‌లో స్పష్టమైంది.

విశాఖ సర్కిల్‌లో కనెక్షన్లు మొత్తం
17,57,727 మంది
డొమెస్టిక్ 15,02,204
కమర్షియల్ 1,70,580
అగ్రికల్చర్ 49,037
ఇన్‌స్టిట్యూషనల్ 30,632
ఇండస్ట్రీస్ 5,274

మరింత తగ్గించేందుకు కృషి చేస్తున్నాం



ఎప్పటికప్పుడు సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నాం. వినియోగదారులకు ఇచ్చే విద్యుత్‌ను నాణ్యంగా ఎలా అందించాలనే అంశంపై సీఎండీ సలహాలు, సూచనలు తీసుకుంటున్నాం. దానికనుగుణంగా మార్పులు చేస్తూ అంతరాయాన్ని క్రమంగా తగ్గించుకుంటూ వస్తున్నాం. ప్రస్తుతం సగటున 4 నిమిషాలున్న ఇంట్రప్షన్‌ను క్రమంగా తగ్గించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. విపత్తుల కారణంగా ఏదైనా అవాంతరాలు ఎదురైనా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇటీవలే ఆటోమేటెడ్ సబ్‌స్టేషన్‌ను రూపొందించాం. మిగిలిన చోట్లా అదే తరహా టెక్నాలజీ వస్తే ఈ అంతరాయం మరింత తగ్గించగలం.

– ఎల్ మహేంద్రనాథ్, ఏపీఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ ఎస్ఈ